www.prajasakti.com

ప్రజాశక్తి

అనారోగ్యంతో ఎంపిపి కేతా శ్రీనివాస్ మృతి



కేతా శ్రీనివాస్ (ఫైల్)

ప్రజాశక్తి - రాజోలు

రాజోలు ఎంపిపి కేతా శ్రీనివాస్ (56) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈనెల 24న మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఆయన సాయంత్రం ఇంటికి వెళ్లి అస్వస్థతకు గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు ఆయనను అమలాపురంలో కిమ్స్‌కు తరలించారు. ఆయన బ్రెయిన్ స్ట్రోక్ కు గురైనట్లు వైద్యులు గుర్తించి వైద్య సేవలు అందించారు. నాలుగు రోజుల పాటు ఆయన మృత్యువుతో పోరాడి శనివారం తుది శ్వాస విడిచారు. కేతా శ్రీనివాస్ 2021లో జరిగిన మండల పరిషత్ ప్రాదేశిక ఎన్నికల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే ఏకైక టిడిపి ఎంపిపిగా ఎన్నికై రికార్డు సృష్టించారు. శ్రీనివాస్ మృతదేహాన్ని మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

ఇవిఎంల భద్రతకు పటిష్ట చర్యలు

- కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్



గొడౌన్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్(ఇ విఎం)లు, వివి ప్యాట్ గొడౌన్‌ల భద్రతకు పటిష్టమైన చర్యలు నిరంతరం కొనసాగించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని స్థానిక ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలోని జిల్లా కార్యాలయాల ప్రాంగణం మూడవ అంతస్తు లో భద్రపరిచిన ఇవిఎం మిషన్లు, వివిప్యాట్ గోదాములను శనివారం కలెక్టర్ మహేష్‌కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి బిఎల్ఎన్.రాజకుమారి సంయుక్తంగా ఎన్నికల సంబంధిత అధికారులతో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ ఇవిఎంల రక్షణ, భద్రతకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.భారత ఎన్నికల సంఘం మార్గ నిర్దేశాల ప్రకారం ప్రతి నెల ఇవీఎం, వీవీ ప్యాట్ గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి, పరిశీలించిన అంశాలను ఎన్నికల సంఘానికి సమగ్ర నివేదికను పంపించాలని సూచించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు క్షుణ్ణంగా పరిశీలించి నివేదికను పంపించడం జరుగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి రాజకుమారి వెల్లడించారు. అనంతరం అగ్నిమాపక అధికారులు నిరంతరం నిఘా ఉంచాలని, సిసి కెమెరాల దృశ్యాల పని తీరును పరిశీలించారు.ఈకార్యక్రమంలో వడ్డీ నాగేశ్వర రావు(కాంగ్రెస్), దొమ్మేటి రమణ కుమార్(టిడిపి), ఎన్నికల విభాగం ఉప తహశీల్దార్ శివరాజ్, స్థానిక తహశీల్దార్ సుభాష్‌లతోపాటు రెవెన్యూ అగ్నిమాపక, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సర్యూట్ టెంపుల్ టూరిజం అభివృద్ధికి చర్యలు

మామిడికుదురు: జిల్లాలో సర్యూట్ దేవాలయ టూరిజమ్ ప్రసాద్ స్కీం కింద అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ ఆర్ మహేష్‌కుమార్ వెల్లడించారు. పాశర్లపూడి లో వైనతేయ గోదావరి పరివాహక ప్రాంతంలో నిరుపయోగంగా ఉన్న టూరిజం రిసార్ట్‌ను శనివారం ఆయన పరిశీలించారు. రిసార్ట్‌ను ఆహ్లాదకరంగా ఉండేటట్లు పర్యాటక రంగ అభివృద్ధికై మరింత స్థల సేకరణకై గుర్తించిన స్థలాన్ని ఆయన పరిశీలించారు ఇప్పటికే పర్యాటక రంగ అభివృద్ధికై కొంతమేర స్థలాన్ని కేటా యించడం జరిగిందని దానికి అనుబంధంగా మరింత విస్తరించాలనే కోణంలో స్థల సేకరణకు చర్య లు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కార్యక్రమం లో ఆర్‌డిఒ కె.మాధవి, తహశీల్దార్ సునీల్ కుమార్, ఎంపిడిఒ భవాని తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె విజయవంతానికి పిలుపు

ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న ధనలక్ష్మి

ప్రజాశక్తి - అమలాపురం

జులై 9న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి పిలుపునిచ్చారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం శనివారం అమలాపురం యుటిఎఫ్ ఎంప్లాయిస్ హోమ్ ఆఫీస్ వద్ద ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎస్తేర్ రాణి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ధనలక్ష్మి పాల్గొని జిల్లాలో ఆశా వర్కర్స్ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ ఆశా వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వ ఇచ్చిన హామీలు అమలు చేయాలని సిఎం చంద్రబాబును, సంబంధిత మంత్రిని అనేకసార్లు కలిసి ఆశ వర్కర్స్ సమస్యల పరిష్కరించాలని కోరామని గుర్తు చేశారు రెండు రోజుల క్రితం రాష్ట్ర కమిషనర్ తో మీటింగ్ జరిగిందని అందులో కొన్ని వర్క్ సంబంధించి సర్కులర్ విడుదల చేశారని ఆ సర్కులర్ లో ఆశ వర్కర్లు ఏ పని చేయాలో చాలా స్పష్టంగా ఉందని అన్నారు. ఆశా వర్కర్ ఎవరు అదనపు పనులు చేయరాదని అదనపు పనులు చేయడం వల్ల ఆశా వర్కర్ల అందరూ అనారోగ్యాన్ని గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చెందారు. 62 సంవత్సరాలు వయోపరిమితి జిఒ రిటర్మెంట్ బెనిఫిట్స్, మరి కొన్ని జిఒలు రావాల్సి ఉందని అన్నారు. జిఒలు వచ్చే వరకు యూనియన్ పోరాటాలు చేస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇచ్చిన పిలుపులు జిల్లాలో తుచా తప్పకుండా పాటించాలని, ఐక్యంగా ఉండి ఉద్యమాల ద్వారా హక్కులు సాధించుకోవాలని తెలియజేశారు. జులై 9 కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులు ఆశా వర్కర్లు అందరూ సమ్మె పాల్గొని సమ్మె జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జి. దుర్గాప్రసాద్ పాల్గొని ఆశ వర్కర్లపై పని ఒత్తిడి తగ్గించి, నాణ్యమైన సెల్ ఫోన్లు,కనీస వేతనం రూ.26వేలు, ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. వచ్చే నెల 9న తలపెట్టిన దేశ వ్యాప్తంగా జరుగుతున్న సమ్మెలో అన్ని మండల కేంద్రాల్లో నిరసన, ప్రదర్శనలలో ఆశా వర్కల్లులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మలక సుభాషిని కార్మికులు ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు గుర్రాల బేబీ,మంగాదేవి, వెంకటలక్ష్మి, బొంతు సుజాత, ఉల్లింగి శ్రీలక్ష్మి ,ఈశ్వరి, కనకదుర్గ, భూలక్ష్మి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఐజి పరామర్శ



పరామర్శిస్తున్న ఐజి అశోక్ కుమార్

ప్రజాశక్తి - ఆలమూరు

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండల కేంద్రానికి చెందిన కానిస్టేబుల్ ఎస్.బ్లెస్సన్ జీవన్ కుటుంబ సభ్యులను ఏలూరు రేంజ్ ఐజి జీవిజి.అశోక్ కుమార్ శనివారం పరామర్శించారు. అలాగే కుటుంబ సభ్యుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి రావలసిన ప్రతి అంశాన్ని వేగంగా వచ్చేలా చర్యలు తీసుకుంటామని కుటుంబ సభ్యులకు ఆయన హామీ ఇచ్చారు. ఈ పరామర్శలో ఆయన వెంట డిఎస్‌పి సుంకర మురళీమోహన్, రూరల్ సిఐ సిహెచ్.విద్యాసాగర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్లో సందర్శించి ఎస్ఐ అశోక్ కానిస్టేబుల్ జీవన్ చిత్రపటాల వద్ద నివాళులు అర్పించారు. అలాగే సిబ్బందికి సూచనలు అందజేశారు.

ఎస్ఐ, కానిస్టేబుల్ మృతికి ఘన నివాళి

విధి నిర్వహణలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్, కానిస్టేబుల్ బ్లెస్సన్ జీవన్‌లకు అధికారులు, ఘన నివాళులు అర్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఇన్‌చార్జి డిఎల్‌పిఒ, ఎంపిడిఒ ఎ.రాజు అధ్యక్షతన ఏర్పాటు సంతాపసభలో ఎస్ఐ అశోక్, కానిస్టేబుల్ బ్లెసన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కెజె.ప్రకాష్ బాబు, ఎంపిపి తోరాటి లక్ష్మణరావు, పరిషత్ ఎఒ మెహర్ ప్రకాష్, డిటి సుబ్బరాజు, ఆలమూరు డిసి ఛైర్మన్ మెర్ల గోపాలస్వామి, నాయకులు ఈదల నల్ల బాబు, ఈదల రాంబాబు, నెక్కంటి సూర్య ప్రకాష్ రావు, తదితరులు పాల్గొన్నారు.ఎస్ఐ ఎం.అశోక్, కానిస్టేబుల్ ఎస్.బ్లెసన్ జీవన్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆలమూరు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో మృతుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

సెల్‌ఫోన్ల రికవరీ.. బాధితులకు అప్పగింత



మాట్లాడుతున్న సిఐ శేఖర్ బాబు

ప్రజాశక్తి - రావులపాలెం

టౌన్ సర్కిల్ పరిధిలో ఇటీవల కాలంలో పలువురు పోగొట్టుకున్న ఖరీదైన మొబైల్ ఫోన్లను అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి రికవరీ చేసినట్లు సిఐ శేఖర్ బాబు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టౌన్ సిఐ ఎం.శేఖర్ బాబు మాట్లాడుతూ చాట్ బోర్డు ద్వారా అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి రూ 3లక్షల విలువైన మొబైల్ ఫోన్లను రికవరీ చేశామన్నారు. ప్రయాణాల్లో బయటకు వచ్చినప్పుడు మొబైల్ ఫోన్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మొబైల్‌ఫోన్లను పోగొట్టుకున్న వారు పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. రికవరీ చేయడంలో కృషి చేసిన పోలీసు సిబ్బంది త్రిమూర్తులు, శ్రీను, నాయడులను సిఐ అభినందించారు.

టిడిపి మండల అధ్యక్ష పదవిని మహిళలకు కేటాయించాలి



వర్ల రామయ్యకు వినతిపత్రం అందిస్తున్న ఉమా మహేశ్వరి

ప్రజాశక్తి - పి.గన్నవరం

పి.గన్నవరం నియోజవర్గంలో నాలుగు మండలాలలో మామిడికుదురు, అంబాజీపేట, అయినవిల్లి మండలాల్లో టిడిపి అధ్యక్ష ఎన్నిక పూర్తి అయింది. పి.గన్నవరం మండల టిడిపి అధ్యక్ష పదవి మహిళకు కేటాయించాలని వాడ్రేవుపల్లి సర్పంచ్, సీనియర్ టిడిపి నాయకురాలు ప్రత్తిపాటి ఉమామహేశ్వరి రాష్ట్ర సంస్థాగత ఎన్నికల కమిటీ ఛైర్మన్, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అచ్చెన్నాయుడు లను కలసి వినతి పత్రం అందజేశారు. టిడిపి సిద్ధాం తాలలో ఒకటైన మహిళా సాధికారితలో భాగంగా మండల అధ్యక్ష పదవితో మహిళకు ప్రాధాన్యత కల్పించాలని ఆమె కోరారు. టిడిపి అధికారంలో లేనప్పుడు టిడిపికి అండగా ఎన్నో కార్యక్రమాలు చేయడమే కాకుండా వాడ్రేపల్లి ఉపసర్పంచ్‌గా, తర్వాత సర్పంచ్‌గా రాజకీయ అనుభవం మరియు విద్యావంతురాలైన ఉమామహేశ్వరుని మండల టిడిపి అధ్యక్ష పదవి కేటాయించాలని పలువురు ఆమెకు మద్దతు తెలుపుతూ వినతిపత్రంలో కోరారు. ఆమె వెంట టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.



అన్న క్యాంటీన్లో భోజనం చేస్తున్న ఆర్‌డిఒ డి.అఖిల

అన్న క్యాంటీన్‌ను పరిశీలించిన ఆర్‌డిఒ

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలో గల అన్న క్యాంటీన్ ను శనివారం రామచంద్రపురం ఆర్‌డిఒ దేవరకొండ అఖిల పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ కేవలం రూ.5 లకే ఉదయం అల్పాహారం మధ్యాహ్న భోజనం రాత్రి భోజనాలు ఏర్పాటు చేయడం ఆషామాషీ కాదని, నాణ్యమైన భోజనం పరిశుభ్రమైన వాతావరణంలో పెట్టే విధంగా ఆర్‌టిజిఎస్, ఐవివిఆర్ఎస్ ల ద్వారా లబ్ధిదారుల అభిప్రాయాలను ప్రభుత్వం సేకరిస్తుంద న్నారు. క్యాంటీన్లో మెనూ ప్రకారం సమయ పాలన పాటిస్తూ నాణ్యత ప్రమాణాలతో తాజాగా భోజనాన్ని వడ్డించాలని ఆదేశిం చారు. తదుపరి స్థానిక ఏరియా ఆసుపత్రిని ఆమె ఆకస్మికంగా సందర్శించి ఆసుపత్రి వైద్య సేవల పట్ల వైద్యుల ద్వారా ఆరా తీసి రోగులకు అందుతున్న వైద్య సేవలను స్వయంగా రోగులని అడిగి తెలుసుకున్నారు. బయటి నుంచి వచ్చే ఒపి రోగులకు సరిపోవ డం లేదని మరొక కౌంటర్ ప్రారంభించాలని ఆమె ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రవీణ్ ను ఆదేశిం చారు. ఈ కార్యక్ర మంలో తహశీల్దార్ బి.మృత్యుం జయరావు, ఆస్పత్రి సూపరింటెం డెంట్ ప్రవీణ్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సక్రమంగా అందని తాగునీరు

- సిఎస్‌ఆర్ నిధులు కళావేదికకు ఖర్చు పెట్టాలని కౌన్సిల్ సభ్యుల డిమాండ్
- ప్రోటోకాల్ పాటించకపోవడంపై సభలో నిరసన



ప్రోటోకాల్ పై నిరసన వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్లు

ప్రజాశక్తి - రామచంద్రపురం

ప్రతి ఏడాది తాగునీటి సరఫరా కు రూ.కోటి యాభై లక్షలు ఖర్చుపెడుతున్న తాగునీరు సక్రమంగా అందడం లేదని, గత నాలుగు రోజులుగా సరఫరాలేదని మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశంలో కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. రామచంద్రపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన జరిగింది. రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ ముఖ్యఅతిథిగా ఈ సమావేశానికి హాజర య్యారు. సమావేశం ప్రారంభమైన వెంటనే మున్సిపల్ కార్యక్రమాలకు వైస్ చైర్మన్ లను కౌన్సిలర్‌లను పిలవడం లేదని, ప్రోటోకాల్ పాటించడం లేదని నల్ల రిబ్బన్లు ధరించి పలువురు కౌన్సిలర్లు నిరసన వ్యక్తం చేశారు. దీనికి కమిషనర్ రాజు మాట్లాడుతూ పొరపాటుగా ప్రోటోకాల్ పాటించలేదని తాను వచ్చింది కొత్తని మళ్లీ ఇటువంటి తప్పులు జరగమని బహిరంగ క్షమాపణ కోరారు. అదేవిధంగా రక్షిత మంచినీరు అందించవలసిన మున్సిపాలిటీ అధికారులు దీనిపై దృష్టి సారించాలని గత ఐదేళ్లుగా కేటాయిస్తున్న రూ.కోటిన్నర నిధులు ఎలా ఖర్చు పెడుతున్నారనేది వివరాలు అందజేయాలని వైస్ చైర్మన్ కొలమూరు శివాజీ, విప్ వాడ్రేవు సాయి ప్రసాద్ లు కోరారు. అదేవిధంగా రాష్ట్ర మంత్రి సుభాష్ తీసుకు వచ్చిన రూ.కోటి 50 లక్షల సి ఎస్ ఆర్ నిధులతో చేపట్టే పనులకు కౌన్సిల్ అదే ప్రాంతంలో ఎంపీ బోస్ నిధులు రూ. రెండు కోట్లతో కళావేదిక నిర్మాణం చేపడతారని రెండింటికి కలిపి ఆ స్థలం కేటాయించాలన్నారు. దీన్ని మినిట్స్ బుక్కులో రాయాలని సభ్యులు పట్టుబట్టారు. సిఎస్‌ఆర్ నిధులు కూడా కళావేదికకు కేటాయిస్తే మరింత బాగుంటుందని ఈ సందర్భంగా సభ్యులు అభిప్రాయపడ్డారు. అనంతరం పలు టెండర్ల ఖరారు కు మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.

అభివృద్ధికి అందరూ సహకరించాలి: ఎంపీ బోస్

మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సభకు విచ్చేసిన రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ రాజకీయాలు చేయవద్దని అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత



తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న డిపిఒ శాంత లక్ష్మి

ప్రజాశక్తి - అంబాజీపేట

ప్రతీ ఒక్కరూ పరిసరాల పరిశు భ్రతకుప్రాధాన్యత ఇవ్వాలని తద్వారా వ్యాధులు దరి చేరకుండా నివారించవచ్చని జిల్లా పంచాయతీ అధికారి శాంత లక్ష్మి సూచించారు. మాచవరం పంచాయతీని శనివారం ఆమె సందర్శించి తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. తడి పొడి చెత్త వేరు వేరుగా డస్ట్ బిన్లలో వేసి చెత్త బండి వచ్చినప్పుడు అందజేయాలన్నారు. ప్రజలంతా చైతన్యమై పరిసరాల పరిశుభ్రతకి ప్రాధాన్యతనిస్తే ఆరోగ్యవంతమైన సమాజంలో జీవించవచ్చన్నారు. వ్యాధుల సీజన్ కావడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ గిడ్ల భీమారావు సూచించారు. అనంతరం చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. పారిశుధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆమె వెంట సర్పంచ్ నాగాబత్తుల శాంతా కుమారి సుబ్బారావు, కార్యదర్శి కె. సత్యనారాయణ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న మంత్రి సుభాష్

వైద్య ఖర్చుల నిమిత్తం రూ.20 వేల సాయం

ప్రజాశక్తి - రామచంద్రపురం

నియోజవర్గంలో పెద తాళ్లపొలం గ్రామానికి చెందిన టేకుమూడి రాము గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఈ విషయాన్ని కూటమి నాయకుల ద్వారా తెలుసుకున్న మంత్రి సుభాష్ శనివారం అతని ఇంటికి వెళ్లి పరామర్శించి, మెరుగైన వైద్యం ఖర్చులు కోసం తక్షణసాయంగా రూ.20 వేలు చెక్కునుఅందజేశారు. మానసికంగా ఒత్తిడికి లోను కాకుండా జాగ్రత్తలు తీసుకుని, త్వరలోనే మంచి ఆరోగ్యం పొందాలని అభిలషించారు. తన కష్టాన్ని తెలుసుకుని స్వయంగా మంత్రి సుభాష్ తన ఇంటికి వచ్చి ఆర్థిక సహాయం చేయడం పట్ల రాము అతని కుటుంబ సభ్యులు, కూటమి పార్టీ నాయకులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

కె.గంగవరం మండలంలోని సుందరపల్లి గ్రామానికి చెందిన దామిశెట్టి వెంకట రాజు ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్ తో మృతి చెందారు. మృతుని కుటుంబాన్ని మంత్రి సుభాష్ శనివారం పరామర్శించి తక్షణసాయంగా రూ.15 వేల సాయం అందించారు. మంత్రి సుభాష్ వెంట కూటమి నాయకులు ఉన్నారు.

36వ రోజుకు ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె



మండపేట లో శిబిరం వద్ద ఇంజినీరింగ్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - మండపేట

మండపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మె శనివారం 36వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు సుబ్బరాజు మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో కుటుంబ పోషణ కష్టంగా ఉందన్నారు. దయనీయ పరిస్థితుల్లో తమ కుటుంబాలను పోషిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నెలకు పైగా కార్మిక హక్కులు కోసం పోరాడు తున్నా తమను ఎవరూ పట్టించుకోవడం లేదని ఇంజినీరింగ్ కార్మికులు వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించి తమ పరిస్థితులను అర్థం చేసుకొని మా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కప్పల అన్నవరం, పిట్టా ప్రవీణ్ కుమార్, సైనం భాస్కరరావు, మందపాటి గన్నియ్య, వెంకటేశ్వర్లు, తలాటి వెంకన్న, వాసంశెట్టి బాలరాజు, టెకి వెంకన్న, కప్పల సురేంద్ర, గంటి నవీన్ కుమార్ తదితరులు, పాల్గొన్నారు.


డిమాండ్లు పరిష్కరించాలి

రామచంద్రపురం: తమ న్యాయమైన డిమాండ్ల కోసం 40 రోజులుగా సమ్మె చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ శనివారం వినూత్నంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం ముందు మెయిన్ రోడ్డు వెంబడి బిక్షాటన గావించారు. తమకు జీతాలు పెంచాలని 40 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల ఇంట్లోకి రావడం కష్టంగా ఉందని అందుకనే చేస్తున్నామని ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికుల తెలిపారు ఇకనైనా ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి తమ న్యాయమైన డిమాండ్ పరిష్కరించాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు.



రామచంద్రపురంలో మున్సిపల్ ఉద్యోగుల బిక్షాటన

వెంకన్న ఆలయానికి 50 సెంట్ల భూమి విరాళం



స్థలదాత చంద్రంను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు తదితరులు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

అంగరలో శ్రీ వైభవ వెంకటేశ్వర స్వామి (వెంకన్న) ఆలయానికి గ్రామానికి చెందిన పడాల మధ్యాహ్నం జ్ఞాపకార్థం ఆయన భార్య చంద్రం 50 సెంట్లు భూమిని విరాళంగా అందజేసింది. శనివారం వెంకన్న ఆలయ ప్రాంగణంలో దాసరి చిన్న రాజా అధ్యక్షతన జరిగిన స్థలదాత చంద్రం సన్మాన సభ నిర్వహించారు. మాజీ డిసిఎంఎస్ ఛైర్మన్ రెడ్డి ప్రసాద్, జడ్‌పిటిసి సభ్యుడు పుట్టపూడి వీర వెంకట సూర్యనారాయణ, వెంకన్న ఆలయ అభివృద్ధి కమిటీ కార్యదర్శి పెద్దింశెట్టి రామస్వామి, గ్రామ సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఎంపిటిసి సభ్యులు అడ్డాల శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గారావు తదితరులు మాట్లాడుతూ సుమారు రూ.అరకోటి విలువచేసే భూమిని విరాళంగా సామాన్య కుటుంబానికి చెందిన గృహిణి చంద్రం అందించడం సామాన్య విషయం కాదన్నారు. అనంతరం స్థలదాత చంద్రంను ఘనంగా సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో సూరంపూడి వెంకటరావు, శంకర్రావు, ఉప సర్పంచ్ యర్రా వీరన్న బాబు, మాజీ సర్పంచ్ సంకా స్వామి కాపు, తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



కాంస్య పతక విజేతకు అభినందనం

ప్రజాశక్తి - అంబాజీపేట

ఉత్తరఖాండ్ హరిద్వార్‌లో ఈనెల23, 25 తేదీలలో నిర్వహించిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీలలో అంబాజీపేట శ్రీనివాస తైక్వాండో క్లబ్ విద్యార్థిని జి.లాహితి తేజ కాంస్య పతకం సాధించిందని కోచ్ పి.త్రిమూర్తులు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంఇఒ కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ హెచ్‌ం సాయిరాం, పీడీ ఉమామహేశ్వ రరావు, ఆదిలక్ష్మి సూర్య కుమారి, ప్రజా ప్రతినిధులు, క్రీడాకారులు, ఎస్ఎంసి కమిటీ సభ్యులు, వైస్ చైర్మన్ బండారు అమ్మాజీ, కోచ్ భార్గవి శ్రీకళ, భూషణం తదితరులు విద్యార్థిని తేజను అభినందించారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

ఆసుపత్రికి వచ్చే ప్రజలకు వైద్య ఆరోగ్య సిబ్బంది మెరుగైన సేవలు అందించాలని ఎంపిపి మేడిశెట్టి సత్యవేణి అన్నారు. శనివారం కపిలేశ్వరపురం మండలంలో అంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అంగర పిహెచ్‌సి రెండవ డాక్టరు ను నియమించాలని, తదితర అంశాలపై తీర్మానించారు. సమావేశంలో జడ్‌పిటిసి పుట్ట పూడి అబ్బు, ఆరోగ్య సిబ్బంది తదితరులు, పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నగర పంచాయతీ పరిధిలోని టిటిఆర్ నగర్‌కు చెందిన జగతా వెంకట శివ కేశవరావు(55) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మృతుని కుటుంబ సభ్యులను శనివారం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు పరామర్శించారు. ఆయన వెంట గుత్తుల సాయి, గొలకోటి దొరబాబు, సాగిరాజు సూరిబాబు రాజు, తదితరులు ఉన్నారు.

లూటుకుర్రులో రాజారత్నం సంస్మరణ సభ



రాజారత్నం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ గిడ్డి, నాయకులు

ప్రజాశక్తి - మామిడికుదురు

సీనియర్ జనసేన నాయకులు విళ్ళ సుబ్బారావు మాతృమూర్తి రాజారత్నం సంస్మరణ సభ లూటుకుర్రు శివారు బాడిలంకలో శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాజారత్నం చిత్రపటానికి ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ, కూటమినేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎంఎల్ఎ గిడ్డి మాట్లాడుతూ రాజారత్నం జీవిత విధానాన్ని, ఆమె స్ఫూర్తిదాయక సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో లూటుకుర్రు సర్పంచ్ అడబాల తాత కాపు, మండల టిడిపి అధ్యక్షులు బోనం బాబు, జనసేన నాయకులు వాసంశెట్టి కుమార్, కూటమి నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొని రాజారత్నం చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు



అందజేస్తున్న బిబిఆర్ వ్యవస్థాపకులు శివరామకృష్ణ

విద్యార్థులకు నగదు బహుమతుల అందజేత

ప్రజాశక్తి - ఆలమూరు

సంధిపూడి గ్రామంలో జడ్‌పి న్నత పాఠశాల విద్యార్థులకు బిబిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నగదు బహుమతులను అందజేశారు. టెన్త్ పరీక్ష ఫలితాలలో ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ఉత్తమ విద్యార్థులకు రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేల నగదు బహుమతులను బిబిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బండారు శివరామకృష్ణ దంపతులు అందజేశారు. సర్పంచ్ తోట భవాని, ఎంపిటిసి సభ్యులు తోలేటి సంతోషి తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

ప్రజాశక్తి-పిఠాపురం

మండలంలోని చిత్రాడ శివారు కాలువలో అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందింది. ఎస్ఐ మణికుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిత్రాడ గ్రామంలోని కాలువల మృతదేహం ఉన్నట్లు సమాచారం అందిందన్నారు. ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించమన్నారు. మృతి చెందిన మహిళ కాకినాడ అచ్యుతాపురానికి చెందిన వై.లీలాసూర్యకిరణ్‌గా గుర్తించామన్నారు. మహిళ భర్త చనిపోగా, కుమార్తె ఉందని, కుటుంబ గొడవలు నేపథ్యంలో రెండు రోజుల క్రితం ఇంట్లో నుంచి బయటకు వచ్చేసిందని తెలిపారు. ఇంతలో కాలువలో మృతదేహం లభ్యమైందన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సిఐ నరేష్‌కుమార్

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి - రాజోలు

కూనవరంలో జరిగిన ఒక చోరీ కేసును ఏడేళ్ల అనంతరం రాజోలు పోలీసులు చేధించారు. నిందితులను అరెస్టు చేసి శనివారం మీడియా ముందు ప్రవేశపెట్టారు. వివరాలను సిఐ నరేష్ కుమార్ వెల్లడించారు. 2018లో కూనవరంలో వెంకటేశ్వర ట్రేడర్ రైస్ మిల్లులో ఆరుగురు వ్యక్తులు ప్రవేశించి ఇన్ కామ్ టాక్స్ అధికారులమని చెప్పి మిల్లు ఓనర్ రుద్ర రామకృష్ణారావును బెదిరించి చోరీకి పాల్పడ్డారు. బాధితుని ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ ఎం.నాగరాజు కేసు నమోదు చేశారు దర్యాప్తు చేపట్టారు. కూనవరం కేసులో నిందితులు అయిన కేశనపల్లికి చెందిన యడ్ల అరవింద్, గూడపల్లి పల్లిపాలెంకు చెందిన ఎస్.సందీప్, పి.గన్నవరం మండలం పోతవరానికి చెందిన నేలపూడి మురళీధర్, గూడపల్లికి చెందిన మొల్లేటి మణికంఠ శుక్రవారం శివకోడు హైవేపై తచ్చాడుతుండగా రాజోలు ఎస్ఐ రాజేష్ కుమార్, సిబ్బందితో కలసి పట్టుకున్నారు. శనివారం వారిని సిఐ సమక్షంలో కోర్టు లో హాజరుపరిచారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

ఇద్దరు విద్యార్థినుల అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండలంలోని మలకపల్లి జడ్‌పి ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు కనిపించడం లేదని వచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. పాఠశాలకు చెందిన కండెల్లి గౌరీ ప్రియ, మెరుపు తేజస్విని విద్యార్థినిలు శుక్రవారం ఉదయం పాఠశాలకు వెళ్లి తిరిగి రాలేదని గౌరీ ప్రియ మేనమామ కొక్కిరపాటి చిన్ని, తేజస్విని తండ్రి మునీశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కూటమి నేతల జోరు..ప్రతిపక్ష నేతల హోరు...

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో గడిచిన వారం అధికార, ప్రతిపక్ష నేతల పర్యటనలతో రాజకీయం వేడెక్కింది. అఖండ గోదావరి ప్రాజెక్టు ప్రారంభోత్సవం నేపథ్యం లో కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్, డిప్యూటీ సిఎం కొణిదెల పవన్ కల్యాణ్ హాజరైన విషయం విధితమే. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ప్రముఖులను ప్రస్తావించిన పవన్‌కల్యాణ్, విద్యా వేత్త, సంస్కరణోద్యమ ఖడ్గదారి కందుకూరి వీరేశ లింగంను విస్మరించడం విమర్శలకు దారి తీసింది. ప్రగతి నిరోధక సనాతన ధర్మాన్ని నిరం తరం వల్లించే బిజెపి సరసన డిప్యూటీ సిఎం చేరటమే ఈ దుశ్చర్యకు కారణమని స్పష్టమవుతోంది. మరో వైపు తాజాగా పునాది పడిన ఈ ప్రాజెక్టు పుష్కరాల నాటికి పూర్తి చేయాల్సి ఉంది. అయితే లక్ష్యానికి అనుగుణంగా అడుగులు పడాలని ప్రజలంతా కోరుకుం టున్నారు. అదేవిధంగా కాంగ్రెస్ అధినేత వైఎస్. షర్మిల పర్యటన ఆ పార్టీ శ్రేణులలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఎన్నికల అనంతరం తొలిసారిగా వచ్చిన షర్మిల ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులతో సమావేశమై కేంద్రంలో ఎన్‌డిఎ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. ఆ పార్టీలో అనైక్యతను అధిగమించాలని హితవు పలికారు. ఇంకో వైపు ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పర్యటించి చంద్రబాబు వంచనపై జనంబాట పట్టాలని, పార్టీ శ్రేణులు సంసిద్ధం కావా లని పిలుపునిచ్చారు. అయితే అధికారం కోల్పోయినా జిల్లాలో ముఖ్యనేతలు ఇప్పటికీ అనైక్యత వెంటాడు తోంది. ఆ పార్టీ రూపొందించిన కార్య క్రమా లను సైతం వేర్వేరుగా నిర్వహిస్తూ విమర్శలను ఎదుర్కొం టున్నారు. తాజా పిలుపును ఏ మేరకు ఐక్యతతో నిర్వహిస్తారో వేచి చూడాలి. మరోవైపు వామపక్షాల ఆధ్వ ర్యంలో అమెరికా- ఇజ్రాయెల్ కలి సి చేస్తున్న మారణ హోమానికి వ్యతిరేకంగా నిర్వహించిన ఆందో ళనలు మిన్నంటాయి. అధిక సంఖ్యలో ఆ పార్టీ శ్రేణు లు సామ్రాజ్యవాద విధానాలను ఎండగట్టారు.

ఉపాధి కూలీలకు వేతన వెతలు

ఉపాధి కూలీలు వేతన వెతలతో ఇబ్బందులు ఎదర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లా వ్యా ప్తంగా ఉపాధి పనులకు సంబంధించిన బకాయిలు నిలిచిపోవటమే ఈ దుస్థితి కారణం. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చిన పుటి నుంచి ఉపాధి చట్టానికి తూట్లు పొడుస్తున్న విషయం విధితమే. సంస్కరణల పేరుతో అనేక మార్పులు తీసుకొచ్చింది. ఐదేళ్ల క్రితం నూతన సాఫ్ట్‌వేర్ అమలు చేసి కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణ అంటూ సాకు చెప్పింది. దీనికి తోడుగా రాష్ట్రంలో ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ ఫీల్డ్ అసిస్టెంట్లను వేధింపులకు గురి చేస్తూ అక్ర మ తొలగింపులకు పాల్పడుతున్నాయి. మరోవైపు ఉపాధి చట్టానికి తూట్లు పొడిచి నెలల తరబడి కూలీలకు బకాయి లు పెట్టడం పరిపాటిగా మారింది. తక్షణమే ఉపాధి బకాయిలు చెల్లించాలని ఉపాధి కూలీలు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

కొనసాగుతున్న అడ్మిషన్ల దందా

నూతన విద్యా సంవత్సరం ప్రారంభం నేపథ్యంలో ప్రయివేట్, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీలలో అడ్మిషన్ల దందా కొనసాగుతోంది. ప్రభుత్వ నిబంధనలకు పూర్తిగా తూట్లు పొడు స్తున్నాయి. ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల విక్రయాలు, అడ్మిషన్ ఫీజులు వసూలు జరుగుతోంది. అయినా విద్యాశాఖ అధికారులు కనీసం కన్నెత్తి చూడకపోవటం విమర్శలకు దారి తీస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలు ఎల్‌కెజి విద్యార్థికి కనీసంగా రూ.20 వేలు ఫీజులు వసూలు చేయటంతో పాటు పుస్తకాలు, బస్‌ఛార్జీల పేరుతో మరో



రూ.10 వేలు యథేచ్ఛగా యాజమాన్యాలు వసూలు చేస్తు న్నాయి. పదో తరగతి చదివించాలంటే పాఠశాలల స్థాయిని బట్టీ రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ వెచ్చించక తప్పడంలేదు. ఇంటర్మీడియెట్ కాలేజీ ఫీజులు సైతం ఆకాశాన్ని తాకుతున్నాయి. నీట్, టార్గెట్ ఐఐటి తదితర పేర్లతో రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకూ వసూళ్లు జరుగుతోంది. ఉన్నతాధికారులు దృష్టి సారించి ఈ దోపిడీని అరికట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

దాన్యం బకాయిలు కోసం వేడుకోలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ధాన్యం బకాయిలు సుమారు రూ.200 కోట్లు నిలిచిపోవటంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. కూటమి ప్రభుత్వం రబీ ధాన్యం కొనుగోలులోనూ, కొనుగోలు చేసిన ధాన్యం నగదు చెలింపులలోనూ రైతులను నట్టేటముంచిందనే అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పంట సాగు ప్రారంభిస్తే వాతావరణ ప్రతికూలతలకు ముందే దిగుబడులు చేతికొస్తాయని రైతులు భావిస్తున్నారు. రైతుల ఆకాంక్షలకు తగ్గట్లుగా పెట్టుబడి సాయం చేయటంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందనే విమర్శలు వస్తున్నాయి. అన్నదాత సుఖీభవ ఇప్పటికీ అమలు చేయకపోవటం ఒక కారణం కాగా బకాయిలు చెల్లింపులపై చొరవ చూపించకపోవటం ప్రధాన కారణమని స్పష్టమతోంది. పాలనా యంత్రాంగం ఇప్పటికైనా చిత్తశుద్ధితో వ్యవహరించి త్వరిగతిన రైతుల బకాయిలు చెల్లించాలి.

దోమల నిర్మూలనకు చర్యలు

ప్రజాశక్తి - అమలాపురం

ప్రజల భాగ స్వామ్యంతోనే దోమల నిర్మూలనకు చర్యలు చేపట్టి ప్రాణాంతక డెంగీ, ఫైలేరియా మలేరియా వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకో వాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి దుర్గారావు దొర అన్నారు. మలేరియా డెంగ్యూ ఫైలేరియా వ్యాధుల నియంత్రణపై ప్రచురించిన ప్రచార గోడ పత్రికలను స్థానిక ప్రాంతీ య ఆసుపత్రి నందు ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి ఎన్ వెంకటేశ్వరరావు, ఉప యూనిట్ ఆఫీసర్ ఆదినారాయణ, సూపర్వైజర్ కే.మేరి జ్యోతి,, జిల్లా ల్యాబ్ టెక్నిషియన్ వి.వి.వి. త్రిమూర్తులు ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

అంగర గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న పారిశుధ్య పనులను శనివారం ఎంపిడిఒ జి.రాజేంద్రప్రసాద్ పరిశీలించారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా మంగళ, గురు వారాల్లో తడి చెత్త, పొడి చెత్త, హానికరమైన చెత్తలను వేరుగా సేకరించే కార్యక్రమంపై ఆయన పర్యవేక్షించి పారిశుధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఆర్ మోహన్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

తల్లికి వందనంపై విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం అనేక చర్యలు తీసుకుంటోందని దానిని సద్వినియోగం చేసుకుని మంచి పౌరులుగా ఎదగాలని మండల విద్యాశాఖాధికారి వైశివరామకృష్ణయ్య పిలుపునిచ్చారు. పిల్లల చదువు తల్లులకు భారం కాకూడదని ప్రభుత్వం కుటుంబంలో చదువుతున్న ప్రతి ఒక్కరికి తల్లికి వందనం పేరిట ఆర్థిక సహకారం అందిస్తుందని ఆయన తెలిపారు. మండల విద్యాశాఖాధికారి 2 పి.పుల్లయ్య మాట్లాడుతూ విద్యార్థులందరూ ప్రభుత్వ పాఠశాలలో చేరేలా స్పెషల్ ఎన్రోల్మెంట్ డ్రైవ్ చేపట్టి, ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. హెచ్‌ఎం ఆర్.విజయలక్ష్మి, తోటకూర సాయిరామకృష్ణ ప్రసంగించారు. ఎన్‌డి.సరస్వతి, ఎన్.వీరభద్ర రాజు, ఎన్ హరనాథ్, రాజు వరహాలు, టి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు పాటల పోటీలు నిర్వహించి విజేతలను ప్రకటించారు.

పశువుల దాణా పంపిణీ

ప్రజాశక్తి - కె.గంగవరం

మండలం కోటిపల్లి కోట రైతులకు పశువుల దాన 50 శాతం సబ్సిడీతో రైతులకు శనివారం రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంయుక్త, ఉమ్మడి కూటమి నాయకులు పెంటూరు వీర రాఘవ చౌదరి, కర్రి చిట్టిబాబు, గొడవర్తి రామకృష్ణ చౌదరి, చీకట్ల సోమేశు, పెమ్మాడి సత్తిబాబు వైట్ల మార్కండేయులు, మిగతా కూటమి నాయకులు రైతులు పాల్గొన్నారు.

30న పాడా కార్యాలయంలో పిజిఆర్ఎస్

ప్రజాశక్తి-పిఠాపురం

పట్టణంలోని స్థానిక పాడా కార్యాలయంలో ఈ నెల 30న సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార (పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు పాడా పీడీ ఎ.చైత్ర వర్షిణి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:00 గంటల నుంచి 01:00 గంట వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని, అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమానికి పిఠాపురం నియోజకవర్గానికి సంబంధించిన డివిజనల్, మండల స్థాయి అధికారులు అందరూ విధిగా హాజరు కావాలన్నారు.

వాడపల్లిలో రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి వచ్చే ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా రద్దీకి అనుగుణంగా నడుపుతామని జిల్లా రవాణా అధికారి రాఘవ కుమార్ అన్నారు. శనివారం ఆయన వాడపల్లి శ్రీనివాస ప్రాంగణంలో ఉన్న బస్టాండ్‌ను .పరిశీలించి అక్కడ ప్రయాణికులతో రద్దీకి అనుగుణంగా బస్సులు తిరుగుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. యాత్రికుల రద్దీ ని బట్టి బస్సులు కూడా ఎప్పటికప్పుడు, రద్దీకి అనుగుణంగా పెంచుతున్నామని ప్రయాణికులకు తెలియజేశారు. తర్వాత ఆత్రేయపురం బస్‌స్టేషన్ కి వెళ్లి నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంక్, ప్రయాణికులకు సౌకర్యంగా బిగించిన సీలింగ్ ఫ్యాన్ లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

యాత్రికులతో కిటకిటలాడిన వాడపల్లి

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ మాడవీధులు శనివారం. యాత్రికులతో కిటకిటలాడింది. ఏడు ప్రదక్షణలు చేసే యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ డిసి నల్లం సూర్య చక్రధర్ రావు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి పర్యవేక్షించారు. దర్శనం అనంతరం యాత్రికులకు ప్రసాద వితరణ భారీ స్థాయిలో అన్నదానం నిర్వహించారు. ఇటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పై ఎస్ రాము తమ సిబ్బందితో ప్రతిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. రాత్రి 9 గంటల వరకు రాత్రిపూట రద్దీ కొనసాగింది. స్వామివారికి రూ.56 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మహిళలు ఆహార అలవాట్లు ఆరోగ్య సూత్రాలు పాటించడంతోపాటు వ్యక్తిగత పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటారని వేచి స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ పోతుమూడి శేష రత్నం అన్నారు. శనివారం మండలంలోని ర్యాలి గ్రామంలో వేచి స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో మహిళల జీవన శైలి పరిశుభ్రత ఆరోగ్యముపై క్యాంపెయిన్ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యంగా మహిళలు హైజెనిక్‌గా ఎలా ఉండాలి ఆరోగ్యంగా ఉండడానికి ఎటువంటి చర్యలు తీసుకోవాలి రుతుక్రమంలో పాటించవలసిన జాగ్రత్తలు తీసుకోవలసిన ఆహారపు అలవాట్లు, ఆరోగ్య సూత్రాలను మహిళలకు వారి యొక్క జీవన శైలిని మెరుగైన పద్ధతిలో ముందుకు కొనసాగించాలని ఆమె పేర్కొన్నారు.

చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

ప్రజాశక్తి - మామిడికుదురు

అయిదేళ్లు నిండిన చిన్నారులను ప్రభుత్వ బడిలో చేర్పించేలా ప్రజలలో చైతన్యం తీసుకురావాలని సమగ్ర శిక్ష జిల్లా ఎపిసి జి.మమ్మీ, సిఎంఒ బివివి.సుబ్రహ్మణ్యం సూచించారు మామిడికుదురులో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మన పాఠశాల- మన అందరి బాధ్యత అవగాహనా ర్యాలీకి వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు అదేవిధంగా మండల విద్యా వనరుల కార్యాలయములో ఏర్పాటుచేసిన సమావేశంలో ప్రభుత్వ బడిబాట- బంగారు బాట కార్యక్రమం అమలుపై పలు అంశాలపై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు లక్ష్మీనారాయణ, మోకా వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - మామిడికుదురు

పాశర్లపూడి సత్రంలో బిసి కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ కేంద్రమును మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ భవాని సూచించారు కుట్టు శిక్షణ కేంద్రాన్ని శనివారం ఆమె సందర్శించి శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడారు. ఏప్రిల్ 18న శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించినట్లు నిర్వాహకురాలు మహే జాజిన్ తెలిపారు 109 మందికి రెండు విడతలు గా శిక్షణ ఇస్తున్నామని, ఇప్పటికే 60 రోజులు శిక్షణ పూర్తి అయిందన్నారు. ఆమె వెంట మండల పరిపాలనాధికారి కారుపల్లి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు

అనారోగ్యంతో మూలస్థానం విఒఎ మృతి

ప్రజాశక్తి - ఆలమూరు

మూలస్థానం అగ్రహారంలో డ్వాక్రా సంఘాల విఒఎగా పని చేస్తున్న దొండపాటి సువర్ణ(45) ఇటీవల అనారోగ్యా నికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. శనివారం పరిస్థితి విషమించి ఆమె మృతి చెందారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, భర్త ఉన్నారు. మృతురాలి కుటుంబ సభ్యులకు ఎంపిడిఒ ఎ.రాజు, ఎపిఎం ఎం.ధనరాజు తదితరులు సంతాపం తెలిపారు.